ఉపాధి కూలీలకు బీమాతో ధీమా

- పీఎం సురక్ష యోజన ప్రీమియం రూ.20
- పీఎం జీవనజ్యోతి ప్రీమియం రూ.436
- జిల్లాలో 3.43 లక్షల మందికి వర్తించనున్న బీమా



గుడిపాల మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

గుడిపాల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు కేంద్ర ప్రభుత్వం బీమా సదుపాయం కల్పిస్తోంది. ప్రమాదాల్లో శ్రామికులు దురదృష్టవశాత్తు మరణించినా, వైకల్యం సంభవించినా బీమా రక్షణ కల్పించేందుకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకాలను అమలు చేస్తోంది. అయితే ఈ పథకాలు ఉన్న సంగతి చాలా మంది శ్రామికులకు తెలియక పోవడంతో వారి కుటుంబాలు నష్టపోతున్నాయి. ఈ పథకాల ద్వారా జాబ్‌కార్డు ఉన్న శ్రామికులందరికీ బీమా చేయించాలని తాజాగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్‌లను ప్రభుత్వం ఆదేశించింది. కూలీల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని బ్యాంకుల్లో నమోదు చేయించే బాధ్యతను ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు సంబంధిత శాఖల అధికారులు అప్పగించారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్ అందజేసే దరఖాస్తుపై వేతనదారులు సంతకం చేసి తిరిగి వారికి అప్పగిస్తే మిగతా ప్రక్రియ అంతా వారే చూసుకుంటారని, వేతనదారుల ఖాతా నుంచి ప్రీమియం మొత్తాన్ని మినహాయించుకుంటారని అధికారులు చెబుతున్నారు. చిత్తూరు జిల్లాలో ఉపాధి పనులకు హాజరవుతున్న 3.43 లక్షల మంది వేతనదారులంతా బీమా పథకానికి అర్హులే.

రెండు రకాలుగా బీమా సదుపాయం

ఉపాధి శ్రామికులకు కేంద్ర ప్రభుత్వం పీఎం సురక్ష, పీఎం జీవన్‌జ్యోతి యోజన పథకాల కింద రెండు రకాల బీమా సదుపాయం కల్పిస్తోంది. పీఎం సురక్ష బీమా యోజన పథకం కింద 18 నుంచి 70 ఏళ్ల వయసు ఉన్న వేతనదారులు ప్రతి సంవత్సరం రూ.20 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకంలో ప్రీమియం చేయించుకున్న వారు ప్రమాదవశాత్తు మరణించినా లేదా పూర్తి వైకల్యం కలిగినా రూ.2లక్షల పరిహారం అందుతుంది. పాక్షికంగా వైకల్యం సంభవిస్తే లక్ష రూపాయల సహాయం అందుతుంది. పీఎం జీవనజ్యోతి యోజన పథకం కింద బీమా పొందేందుకు 18 నుంచి 50 ఏళ్ల వయసున్న వారు ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లించాలి. ప్రమాదవశాత్తు మరణించినా, సహజ మరణం పొందినా రూ.2 లక్షలు అందుతుంది. జాబ్‌కార్డు ఉన్న వేతనదారులంతా ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లను సంప్రదించి త్వరగా ప్రీమియం చెల్లించాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో ఉపాధి హామీ జాబ్‌కార్డులు, వేతనదారుల వివరాలు

మొత్తం జాబ్‌కార్డులు	2,69,000
యాక్టివ్‌లో ఉన్నవి	2,07,000
వేతనదారుల (కూలీల) సంఖ్య	4,82,000
యాక్టివ్‌లో ఉన్నవారి సంఖ్య	3,43,000
ప్రస్తుతం పనులకు హాజరవుతున్న వేతనదారులు	55,000

బీమా చేయించుకోవాలి

జాబ్‌కార్డు ఉన్న ఉపాధి వేతనదారులు అంతా పీఎం సురక్ష, పీఎం జీవనజ్యోతి యోజన పథకాల్లో ఏదో ఒక పథకం కింద బీమా చేయించుకోవాలి. ఉపాధి సిబ్బంది ఇచ్చే దరఖాస్తులపై వేతనదారులు సంతకాలు చేసి ఇస్తే వేతనదారులకు ఖాతా ఉన్న బ్యాంకులో వాటిని సమర్పిస్తాం. వేతనదారుల ఖాతా నుంచి ప్రీమియం మినహాయించుకుంటారు. బీమా కోసం ఎవరికి నేరుగా నగదు చెల్లించాల్సిన అవసరం ఉండదు.

– సుబ్రమణ్యం, ఉపాధిహామీ ఏపీడీ

క్లుప్తంగా

దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలి



మాధవరంలో మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని మాధవరంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించి దోమలు లార్వా దశలోనే నశింపచేయాలని సూచించారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ తనిఖీ

యాదమరి: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డా.సుదర్శన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిధిలోని గుట్టకింద హరిజనవాడలో సోమవారం నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డు దారులకు రూ.ఐదు లక్షల వరకు పూర్తిగా ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యకర్త అమ్ములు, ఆశా కార్యకర్త అంజలి పాల్గొన్నారు.

చెడుమార్గంలో వెళ్లొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

పూతలపట్టు (కాణిపాకం): యువత చెడు మార్గంలో వెళ్లద్దని, మత్తుకు బానిస కావద్దని సీఐ కృష్ణమోహన్ సూచించారు. పూతలపట్టు మండలం ఆకనంబట్టులో సోమవారం రాత్రి ఆయన పల్లెనిద్ర నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఫ్యాషన్ పేరుతో యువత పెడదోవపడుతోందన్నారు. మద్యం తాగడం ఫ్యాషన్‌గా మలుచుకున్నారని చెప్పారు. ఇప్పుడు గంజాయి మత్తులో జోగుతున్నారని, ఆన్‌లైన్ బెట్టింగ్‌లో మునిగి తేలుతున్నారన్నారు. వీటి నుంచి బయట పడితే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఏం చేస్తున్నారో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వారు సన్మార్గంలో నడిచేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందనే విషయాన్ని మర్చిపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ జ్యోతి, సర్పంచ్ మణి, గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు సన్మానం



అర్చకులను సన్మానిస్తున్న ఈవో పెంచల కిషోర్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో సోమవారం ఉగాది పురస్కారాలు అందుకున్న అర్చకులను ఈవో పెంచల కిషోర్ చిరు సన్మానంతో సత్కరించారు. ఇటీవల ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న ఉప ప్రధాన అర్చకులు, గణేష్ గురుకుల్, వేద పండితులు సత్యనారాయణ శర్మ, చిత్తూరు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న వేద పండితులు సుబ్బారావును దుశ్శాలువలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈఈ వెంకట నారాయణ, ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోండి



ఐరాల గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఐరాల : విద్యార్థులు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఐరాల గ్రంథాలయ అధికారి సుజాత తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వేసవి శిక్షణా శిబిరాలను ప్రారంభించారు. గ్రంథాలయంలో విద్యార్థులు పుస్తక పఠనం చేయించారు. స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి శిక్షణా తరగతులు దోహదపడుతాయన్నారు. విద్యార్థులకు మిఠాయిలు, చాక్లెట్లు పంచిపెట్టారు.

ఉన్నత లక్ష్యాలకు విద్యే మూలం



సత్తా చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: సమాజంలో ఉన్నత లక్ష్యాలను అందుకునేందుకు విద్యే మూలమని మంగళపల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని సోమవారం మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ, పాఠశాలలో చదువుతున్న హేమ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో జిల్లా స్థాయిలో ప్రతమ స్థానం సాధించిందన్నారు. 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి మంగళపల్లె పాఠశాలకు గుర్తింపు తీసుకు వచ్చినట్లు చెప్పారు. సర్పంచ్ మురళి మాట్లాడుతూ, మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వినూత్న కార్యక్రమాలకు నిలయమని కొనియాడారు. ఇక్కడి ఉపాధ్యాయులు అందరూ నిబద్ధతతో పనిచేస్తుండడం అభినందనీయమన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ రమేష్‌బాబు మాట్లాడుతూ, మండలంలో ప్రథమ స్థానం సాధించే విద్యార్థులు ఈ సంవత్సరం జిల్లాలో ప్రథమ స్థానం సాధించడం సంతోషకరమన్నారు. మాజీ సర్పంచ్ భాస్కర్‌నాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు బిర్లానాయుడు, మోహన్‌రాజ్ మాట్లాడుతూ, పాఠశాలలోని విద్యార్థులు సాధిస్తున్న ప్రగతి గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం హేమ(592), పునీత్‌సాయి(584), హిమ (584), చాణక్య (555), కౌశిక్(529)ను అభినందించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంజీవి, అరుణశివప్రసాద్, సంపంగి, పిల్లారప్ప, ప్రేమకృష్ణ, భారతి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, ధనశేఖర్ పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఐరాల సీడీపీఓ నిర్మల

తవణంపల్లె: కిశోర వికాస వేసవి శిబిరాన్ని విజయవంతం చేయాలని ఐరాల సీడీపీఓ నిర్మల తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం మండల స్థాయిలో వర్క్‌షాప్ నిర్వహించారు. సీడీపీఓ నిర్మల మాట్లాడుతూ కిశోర బాలికలు సమ్మర్ క్యాంపు ద్వారా సాధికారత సాధించాలని ఆకాక్షించారు. మే నెల 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు క్యాంపు నిర్వహించాలని సూచించారు. రుతుక్రమ పరిశుభ్రత, లింగ అసమానత, బాలల హక్కులు, రక్షణ, విద్య, భవితకు మార్గదర్శకం, సైబర్ ఆన్‌లైన్ భద్రత గురించి వివరించాలని పేర్కొన్నారు. కౌమార బాలికల నాయకత్వం, సాధికారత, శారీరక వ్యాయామం, క్రీడలు, బాల్య వివాహాలు గురించి కిషోర బాలికలకు అవగాహన కల్పించాలని వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం రవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, సంఘమిత్రలు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



మ్యాన్‌హోల్‌కు అడ్డుగా పెట్టిన ఇనుప గేటు

చిత్తూరు నగరంలోని 8వ డివిజన్ పరిధిలో ఉన్న కుమార్ నగర్ కాలనీ– సీఎంటీ రోడ్డుపై ఓ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోల్‌ను ప్రతి ఆర్నెళ్లకు ఓసారి మరమ్మతులు చేయిస్తున్న అధికారులు, శాశ్వత పరిష్కారం కనుగొనలేకపోతున్నారు. మురుగునీళ్లు వెంగళరావు కాలనీను ముంచెత్తేటప్పుడు ఈ మ్యాన్‌హోల్‌కి దిగి.. నాలుగు బండరాళ్లు తీయడం, ఆపై గేటుతో మూసేయడం మామూలే. కాలువ నీళ్లు సక్రమంగా ప్రవహించడానికి ప్రత్యామ్నాయ చర్యలు ఏర్పాటు చేస్తే.. ఇక్కడ మ్యాన్‌హోల్ అవసరం ఉండదని అధికారులు గుర్తించడంలేదు. ప్రస్తుతం ఈ మ్యాన్‌హోల్‌లో ఓ ఇనుప గేటును పెట్టిన సిబ్బంది.. పెద్ద ప్రమాదం జరగకమునుపే మేలుకోవాల్సిన అవసరం ఉంది. – చిత్తూరు అర్బన్

సమస్యల 'సదన్'



పక్కన పడేసిన తాగునీటి కూలర్



పనిచేయని ఏసీ



పనిచేయని గీజర్

కాణిపాకం: కాణిపాకంలోని వినాయకసదన్‌లో వసతులు కరవుతున్నాయి. సదన్‌లో బస చేసే భక్తులు వసతులు లేమితో ఇబ్బందిపడుతున్నారు. వినాయక సదన్‌లో 100 గదులున్నాయి. ఇందులో నాన్ ఏసీ గదులు 52, సూట్‌లు 8, ఏసీ గదులు 40 ఉన్నాయి. ఈ గదులు చాలీచాలని పరిస్థితి. అయితే ఉన్న గదుల్లో కూడా వసతులు లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా పలు గదుల్లో ఏసీలు పనిచేయడం లేదు. వేసవి తాపం నుంచి కాస్త స్వేద తీరాలని భక్తులు ఏసీ ఆన్ చేస్తే అవి పని చేయకుండా మొరాయిస్తున్నాయి. దీంతో భక్తులు విలవిలలాడిపోతున్నారు. అలాగే గీజర్లు మూలనపడ్డాయి. వేకువజామున స్నానం చేయాలంటే అవస్థ పడుతున్నారు. అలాగే తాగునీటి కూలర్, ఫ్రిజ్జులు పక్కన పడేశారు. దీంతో వసతి గదుల నిర్వహణపై భక్తులు పెదవి విరుస్తున్నారు.

ఆహా... నీడ ఎంత హాయో!



ఎడారిలో ఆముదపు మొక్క అయినా మహా వృక్షమే అంటారు. మండు వేసవిలో నడినెత్తిన సూరీడు సుర్రుమనిపిస్తుంటే కాస్తంత నీడదొరికితే చాలనుకుంటారు ప్రయాణికులు. చిత్తూరు–వేలూరు రహదారిపై అనుపు గ్రామం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు వాహన చోదకులకు చల్లని నీడతోపాటు మంచి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రకృతి చేకూర్చిన అందమైన ఆర్చిలా పచ్చనిచెట్లు రోడ్డుపై ఎండ నుంచి గొడుగు పడుతుంటే ఈ రహదారిలో ప్రయాణించేవారు కొంతసేపు చెట్లనీడన ఆగి వేసవితాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. పంటపొలాల మీదుగా వచ్చే చల్ల గాలులను చెట్లు నీడన కూర్చుని ఆస్వాదిస్తున్నారు. – గుడిపాల

సరైన ప్రణాళికతో ఉజ్వల భవిష్యత్తు

- ఇంటర్మీడియట్ కోర్సుల ఎంపిక కీలకం
- విద్యార్థుల్లో సందిగ్ధం
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ చూపాల్సిందే



ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఐరాల: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తీర్ణులైన తరువాత ఏ కోర్సులను ఎంపిక చేసుకోవాలో, చదువులను ఎలా కొనసాగించాలో అని విద్యార్థులు సందిగ్ధంలో మునిగిపోతారు. ఇంటర్మీడియెట్‌లో ఏ గ్రూపు తీసుకోవాలి. ఏ గ్రూపు తీసుకుంటే భవిష్యత్ బాగుంటుంది. ఎవరిని అడగాలి? అనే సందేహంతో తల్లిదండ్రులు, విద్యార్థులు సతమవుతుండడం సహజం. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఉన్నత చదువులు చదివేందుకు వారధి ఇంటర్మీడియెట్. ఇందులో గ్రూపు ఎంపిక అత్యంత కీలకమైన అంశం. విద్యార్థులు తమకు ఇష్టమైన సబ్జెక్టులను ఎంచుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రణాళికాబద్ధంగా చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకోవడానికి సులభతరమవుతుందని విద్యావంతులు సూచిస్తున్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాణిపాకం జెడ్పీ హైస్కూల్ ప్లస్ బాలికల కళాశాలల్లో వివిధ గ్రూపులను నిర్వహిస్తోంది. ఇంటర్మీడియెట్ చదవాలనుకునే విద్యార్థులు ఏ గ్రూపులో చేరితే ఏ సబ్జెక్టులు ఉంటాయి. తదనంతరం ఆయా గ్రూపుల్లో ఉత్తీర్ణులైన వారికి ఎలాంటి కొలువులు లభిస్తాయి అన్న అంశాల గురించి ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ వివరించారు.

ఎంపీసీ: ఇంజినీరింగ్ రంగంలో స్థిరపడాలనుకునే వారు తీసుకోవాల్సిన గ్రూపు ఎంపీసీ. ఎంసెట్ రాసి సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్స్, ఎరోనాటికల్స్ తదితర కోర్సుల్లో ఇంజినీరింగ్ చేయాలనుకునే వారికి ఈ గ్రూపు పునాదిలాంటిది.


బైపీసీ: ఎంసెట్, నీట్ పరీక్షల ద్వారా డాక్టర్, వైద్య సంబంధిత వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడాలనుకునే వారికి బైపీసీ గ్రూపు ఎంతో ఉపకరిస్తుంది. అగ్రికల్చర్, వెటర్నరీ కోర్సులకు ఈ గ్రూపు ప్రాతిపదిక, ఓపికగా చదవడం, స్పష్టంగా సైన్స్ బొమ్మలు గీయడం లాంటివి ఈ గ్రూపు విద్యార్థులకు ఉండాల్సిన లక్షణాలు.

సీఈసీ: ఈ గ్రూపు సేవా రంగం వైపు వెళ్లే వారు తీసుకోవచ్చు. కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులు ఈ గ్రూపులో ఉంటాయి. చార్టెడ్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు, కమర్షియల్ ఏంజెట్లు, బ్యాంకులలో పలు విభాగాల్లో ఉద్యోగాలు పొందాలనుకుంటే ఈ గ్రూపు ఎంతో ఉపకరిస్తుంది. స్టాక్ మార్కెట్‌లలో ఉద్యోగాలు పొందాలనుకునే వారు కూడా ఈ గ్రూపును తీసుకోవచ్చు.

ఐటీఐ: ఇండ్రస్టియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ కోర్సులను ఎంచుకోవడం ద్వారా విద్యార్థులు పదో తరగతి తరువాత రెండేళ్ల సాంకేతిక విద్యలో నైపుణ్యం పొందవచ్చు. ఎలక్ట్రికల్, డీజిల్ మెకానిక్ తదితర కోర్సులు పూర్తయిన వెంటనే ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. పరిస్థితులు అనుకూలిస్తే సాంకేతిక విద్యారంగంలో ఉన్నత స్థాయి కోర్సులు చదివే అవకాశం ఉంటుంది.

పాలిటెక్నిక్: పదో తరగతి తరువాత ఏదైనా సాంకేతిక విద్యలో నైపుణ్యం సంపాదించాలంటే ఉత్తమ మార్గం పాలిటెక్నిక్. ఇందుకోసం విద్యార్థులు పాలిటెక్నిక్‌లో ఎంట్రన్స్‌లో అర్హత సాధించాలి. మెరిట్ ఆధారంగా ఇందులో సీట్లు కేటాయిస్తారు.

ఆసక్తి ఉన్న గ్రూపులను ఎంచుకోవాలి



పది పాసైన విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో తమకు ఆసక్తి కలిగిన సబ్జెక్టులు ఉండే గ్రూపులను ఎంచుకోవాలి. భవిష్యత్తులో ఏ రంగం వైపు వెళ్లాలనుకుంటున్నారో నిర్ణయించుకుని అదే లక్ష్యంతో కోర్సులను ఎంపిక చేసుకొని చదవాలి. ఏది పడితే అది, ఒకరిని చూసి మరొకరు పోటీపడి కోర్సులను ఎంపిక చేసుకొని కెరియర్‌ను పాడుచేసుకోకూడదు. ఇష్టమైన సబ్జెక్టులను ఎంచుకొని అందులో రాణించాలి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్‌లో సెరికల్చర్, ఈఈటీ గ్రూపులున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం నూతనంగా ఎంబైపీసీ గ్రూపును చేర్చనున్నది. ఆయా గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసేందుకు జూన్ నెల వరకు గడువు ఉంది.

– రెడ్డిరామరాజు, ప్రిన్సిపల్, ఐరాల

దారి ఆక్రమించారు సారూ..



ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ లోకనాథ పిళ్లై

శ్రీరంగరాజపురం : మండలంలోని పాతపాళ్యం దళితవాడ గ్రామంలో 30 ఇళ్లకు దారి సౌకర్యం కల్పించాలని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ లోకనాథ పిళ్లైకి గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి గ్రామకంఠంలో ఆరు అడుగుల వెడల్పుతో దారి సౌకర్యం ఉండేదని, గతంలో రెవెన్యూ, పోలీసులు అధికారులు జాయింట్ సర్వే చేసి ఈ భూమి గ్రామకంఠానికి చెందినదే అని నిర్ధారించారని, ఆ తరువాత దారి సౌకర్యం కల్పించారని చెప్పారు. కానీ నేడు ఆ దారి కబ్జాకు గురైందని, మరోసారి సర్వే చేసి గ్రామానికి దారి సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 21 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 12, శ్మశానానికి దారి 01, భూసర్వే 03, ఇంటి నిర్మాణానికి పొజిషన్ పట్టా మంజూరు చేయాలని 02, పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని 02, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులను చూపించాలని 01 వంటి సమస్యలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమానికి రెవెన్యూ సిబ్బంది, అర్జీదారులు పలువురు పాల్గొన్నారు.